# మలుపు

డిస్ట్రిక్టు అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ మేనేజరు కామేశ్వర రావు, చిరాగ్గా వున్నాడు. వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపబడిన ఆ మారుమూల గ్రామం దగ్గర, అడవికి కాస్తదూరంలో టెంట్‌లో అతగాడూ, బుల్‌డోజర్ డ్రైవర్ కృష్ణమూర్తీ, జ్వరంతో పడివున్న మరో డ్రైవర్ లక్ష్మణరావూ, పని కుర్రాడూ వున్నారు. టెంట్‌లో మూలగా వేసివున్న నులకమంచంమీద, లక్ష్మణరావు ఒళ్లెరగని జ్వరంతో, మగతగా వుండి వుండి కలవరిస్తున్నాడు. వైద్య సౌకర్యంగానీ, బస్సు సౌకర్యంగానీ లేని ఆ గ్రామంలో, ఏ వైద్య సదుపాయమూ లేదు. అందు కని ఫోర్‌మన్‌ని జీపులో పంపాడు మందుకోసం కామేశ్వరరావు. ఈలోగా కలెక్టర్ మురళి వర్కుస్పాటు మీదకు ఇన్‌స్పెక్షన్‌కు వస్తున్నా డని కబురు వచ్చింది. మురళి కుర్రవాడు. హుషారైనవాడు. డ్యూటీ తప్ప మరొకటి తెలియని మనిషి. డబ్బునూ, మొహమాటాల్నీ లక్ష్య పెట్టని వ్యక్తి. స్టాఫ్‌లో అలసత్వాన్నీ, బద్ధకాన్నీ క్షమించడు. పది హేను రోజుల్లో ఈ అడవంతా బుల్‌డోజర్లతో చదునుచేసి ఇక్కడ హరిజనులకోసం ఓ 'ల్యాండ్ కాలనైజేషన్ సొసైటీ' పెట్టాలని సంక ల్పించారు. అందుకోసం బుల్‌డోజర్లనూ, ఇద్దరు డ్రైవర్లనూ, వాళ్ళకు వండిపెట్టటానికి ఓ పని కుర్రాణ్ణీ పంపారు వారం క్రితం. కామేశ్వరరావు నిన్న వచ్చాడు. తీరావచ్చి చూచేసరికి, అడవి ఏకొద్ది భాగమో తప్ప, మిగతాదంతా చెక్కుచెదరకుండా వుంది!

కామేశ్వరరావు డ్రైవర్ల నిద్దరినీ కేకలేసాడు. ముఖ్యంగా డ్రైవరు లక్ష్మణరావు ప్రవర్తన ఏమీ నచ్చలేదు. ఇంతక్రితం ఘాట్ రోడ్లు వేయ

టానికీ, ఇలాటి మారుమూల ప్రాంతాలలో వున్న చిన్న చిన్న తిప్పలూ, పెద్ద పెద్ద బండలూ తొలగించటానికీ, మట్టిదిబ్బలు చదునుచేయటానికీ, లక్ష్మణరావును పంపిస్తే, అతగాడు చాలా సాహసం చూపి, అనుకున్న దానికంటే ముందుగానే, వర్క్ ముగించి, తనకూ, స్టాఫ్‌కూ కూడా మంచి పేరు తెచ్చాడు. అంచేతే ఈసారి గూడా అతగాణ్ణీ, మరో డ్రైవరు కృష్ణమూర్తిని గూడా వెంట ఇచ్చి పంపాడు ఇక్కడికి.

"అడవి ప్లాన్ కాగితం నీ దగ్గరుంది. ప్లాట్ మార్క్ చేసుకుని, పనెందుకు చేయలేదు?" అన్నాడు కామేశ్వరరావు నిన్న రాగానే. ఈ వారం రోజులూ, తిని కూర్చోవటం తప్ప, పని జరగలేదని తెలిసి మండిపడ్డాడు.

"చూడండి సార్! ఎంత పెద్ద అడవో. ప్రకృతి తల్లి కట్టుకున్న ఆకుపచ్చని పట్టుచీరెలా ఎంత అందంగా వుందో! ఈ పెద్ద పెద్ద వృక్షాలను చూడండి! ఒక్కోచెట్టు కింద, షుమారు ఓ వంద దుప్పులూ, జింకలూ, ఆవులూ హాయిగా విశ్రాంతిగా పడుకొని నెమరువేసుకోవచ్చు. ఎవరూ నాటలేదు. ఎవరూ నీళ్లుపోసి పెంచలేదు. ఎంత ఏపుగా, ఆరోగ్యవంతమైన బిడ్డల్లా, మనిషిలోని ఆత్మవిశ్వాసంలా, నింగికీ, నేలకీ వంతెనల్లా పెరిగాయో చూడిండి. ప్రతిఫలం కోరకుండానే మానవాళికి మేలుచేసే మహాతపస్వుల్లా నిల్చునివున్నాయి కాదూ? వీటని నరకటం.... ఊహూఁ! నావల్ల కాదు, అన్నాడు తలవంచుకొని.

నిర్ఘాంతపోయాడు కామేశ్వరరావు. ఈ జవాబేమిటి? ఈ ఆలోచనేమిటి? ఇది ఒకరకమైన తలపొగరా? రెండో డ్రైవర్ కృష్ణమూర్తి మేనేజరు మొహంలో మార్పులు కనిపెట్టి, నవ్వుతూ అన్నాడు. "వారం రోజుల్నుంచీ ఇదే వరస సార్! నన్ను వర్కు చెయ్యానివ్వడు; తను చెయ్యడు. రోజూ అడివి మొదట్లోకి బుల్‌డోజర్లు తీసికెళ్ళటం, ప్లాను

కాగితం మడిచి జేబులో పెట్టుకోవటం....చెట్లనూ, పుట్టలనూ గంటల తరబడీ చూడటం....వెనక్కి రావటం....ఇదేవరస!" హేళనగా అన్నాడు. కామేశ్వరరావుకు ఒళ్లు మండుకొచ్చింది. "ఏమిటి నీవుద్దేశ్యం లక్ష్మణరావు? డ్యూటీ ఎగ్గొట్టి జల్సాచేద్దామనా?" అంటూ గర్జించాడు. కలెక్టరుకు తనేం సమాధానం చెప్పుకోవాలన్నది తోచటంలేదు.

"ఊహూఁ!'' ఏదో నసగబోయాడు లక్ష్మణరావు.

"నో! ఇలాటి నిర్బాధ్యత నేనొప్పుకోను. పదండి. నేనూ వస్తాను. అడవి చదునైపోయేంతవరకూ నేనూ వుంటానిక్కడే!" అన్నాడు మొండిగా! కృష్ణమూర్తి బుల్‌డోజరు స్టార్ట్ చేశాడు. లక్ష్మణరావును డ్రైవింగ్ సీట్లో కూర్చోబెట్టి, తనూ అతగాడి ప్రక్కన నిల్చొని బుల్‌డోజరు స్టార్ట్ చేయించాడు కామేశ్వరరావు. బడికి వెళ్ళటం ఇష్టంలేని చిన్న పిల్లాడిలా, పలక్కుండా డ్రైవ్ చేశాడు లక్ష్మణరావు. ప్లాన్ ప్రకారం బుల్‌డోజర్ మొదటవరస చెట్లునరికి వేసి, అడవిలోకి చొచ్చుకుపోతోంది. చెట్లు తెగిపడటంతో లేస్తున్న దుమ్ముతోపాటు, అందాకా ఓ పెద్ద చెట్టుక్రింద వలయాకారంగా పడుకుని వుండి, బుల్‌డోజర్ల శబ్దానికి, ప్రాణభీతితో పరుగుడుగెతున్న ఎన్నో దుప్పులూ, జింకలూ ఆ దుమ్ముకవతల లీలగా కనిపించాయి లక్ష్మణరావుకు. అవి దిక్కుతోచక అడవి బయటకు పరుగెత్తగానే, వలలు వేసుక్కూర్చున్న గ్రామీణులు, ఆ రాత్రికి వాటి తాలూకు మాంసం కూరలూ....ఒక్కసారిగా తల తిరిగినట్లైంది లక్ష్మణరావుకు.

బుల్‌డోజరు అదుపు తప్పబోయింది.

"ఏమిటోయ్ ఆలోచన! బుర్ర ఇక్కడేవుంచి సరిగా డ్రైవ్ చెయ్యి!" విసుక్కున్నాడు కామేశ్వరరావు. మరోమలుపు తిరిగింది బుల్‌డోజరు.

బ్రహ్మాండమైన పుట్టను బుల్‌డోజరు బ్లేడ్ మొదలంటా ఎత్తింది. పుట్ట చెల్లాచెదరు కావటంతో, మట్టిలోంచి, తోకమీదలేచినిల్చొని, పడగ విప్పింది బ్రహ్మాండమైన నాగుపాము. "అబ్బ ! ఎంత పెద్ద నాగుబాము ! నాచిన్నప్పుడెప్పుడో ఓసారి చూశాను ఇలాటిది !" అన్నాడు లక్ష్మణరావు తన్మయత్వంగా ! ఠక్కున స్టీరింగ్ వీల్ చేతికి తీసుకొని, స్పీడుగా ప్రక్కకు తిప్పి, పాము రెండు ముక్కలయ్యేలా బుల్‌డోజరు బ్లేడును మట్టిలోకి నొక్కేశాడు కామేశ్వరరావు.

"అరెరే ! ఎందుకలా చేశారుసార్ ?" అన్నాడు లక్ష్మణరావు బాధగా.

"ముద్దెట్టుకుందామా ఏమిటి ? పోనీ !" అన్నాడు కామేశ్వరరావు కోపంగా !

చెట్లు పెంచటమేగానీ, తుంచటం ఎరగని తోటమాలి కొడుకు లక్ష్మణరావు. చిన్నతనంనుంచీ, ఓ కలవారి ఇంటిచుట్టూరావున్న తోటలో, తోటమాలిగావున్న తండ్రి వెంటా, వెనకా తిరుగుతూ, మొక్కలలో, చెట్లలో, చైతన్యాన్నీ, అందాన్నీ చూచి, పరవశించిపోయే స్వభావం అతగాడితోబాటు పెరిగి పెద్దదైంది. తండ్రి, మెట్రిక్ ప్యాస్ చేయించి, పాలిటెక్నిక్‌లో చేర్చాడు. ట్రైనింగ్ పూర్తయి వచ్చేసరికి, ముక్కలమధ్యే, మొక్కల పెంపకంలోనే, చిన్న జబ్బుసాకుతో, చని పోయాడు తండ్రి ! తల్లి చిన్నప్పుడే చనిపోయిన లక్ష్మణరావుకు, చాలా రోజులవరకూ, తండ్రి జ్ఞాపకాలూ, తోట జ్ఞాపకాలూ వదల్లేదు. ట్రైనింగ్ పూర్తయి ఉద్యోగంలో చేరిన ఈ రెండేళ్ళలోనూ అతగాడు ఎన్నో బస్సురోడ్లూ, పెద్ద పెద్ద కొండప్రదేశాలూ చదునుచేశాడు. వరదలలో పడిన మట్టిదిబ్బలు, ఇసుక మేటలు తీసివేశాడు. ఇలా తన చేతులతో అడవి నరికి చదును చేయవలసి వస్తుందని కలలోకూడా

వూహించలేదు. ఈ అడవి నరికి, ఇక్కడ ఫారం పెట్టవచ్చు. ఈ చుట్టు ప్రక్కల నాగరికత పెరగవచ్చు. కానీ ఈ వృక్షాలలో ఒక్కటైనా పెంచగలరా ఎవరేనా తిరిగి ? ఇలాటి అడవిని మళ్ళీ సృష్టించగలరా? ఇదే ఆలోచన, ఇదే బాధ! తనలో తోటమాలి రక్తం ప్రవహిస్తోంది. చెట్లకూ, తనకూ, ఊపిరితిత్తులకూ, శ్వాసకూ వున్నంత సంబంధంవుంది.

"ఏమిటోయ్! లక్ష్మణరావ్! చెట్లేదో మనషులైనట్లూ, మనుషుల పీకలు కోయమన్నట్లు బాధపడ్తున్నావు ?" అంటున్న కామేశ్వరరావు మాటలతో తృళ్ళిపడ్డాడు లక్ష్మణరావు. ఫెళఫెళమంటు పెద్ద చెట్టు విరిగి పడింది. ముద్దుగా వున్న ఐదారు కుందేలు పిల్లలు.... ఎటు పరుగెత్తాలో తోచక, చెట్టు క్రిందపడి చచ్చాయి. మరికొన్ని పరుగెత్తాయి బాణాల్లా! కళ్ళు తిరిగినట్లయి, సీటులోంచి పక్కకు ఒరిగాడు లక్ష్మణరావు. గబుక్కున స్టీరింగును ఓ చేత్తోనూ, రెండో చేత్తో లక్ష్మణరావునూ పట్టుకున్నాడు కామేశ్వరరావు.

"ఇక నావల్లకాదు సార్!" అన్నాడు హీనస్వరంతో లక్ష్మణరావు.

"నా కర్మ!" నుదురుకొట్టుకొని, డ్రైవింగ్ సీట్లో తను కూలబడి, లక్ష్మణరావును ప్రక్కన కూర్చోపెట్టుకొని .... టెంట్ దగ్గరకు తీసుకవచ్చాడు కామేశ్వరరావు.

ఒక్క గంటలో లక్ష్మణరావుకు ఒళ్ళెరుగని జ్వరం వచ్చేసింది. అర్థంకాని కలవరింతలు మొదలైనాయి. ఇదంతా నిన్న జరిగింది.

ఈ రోజు కలెక్టరు మురళి వస్తున్నాడని ఖబురు రావటంతో, ముచ్చెమటలు పోస్తున్నాయి కామేశ్వరరావుకు. చూస్తుండగానే కలెక్టరు జీపు వచ్చి, టెంట్ ముందు ఆగింది. వెనకాలే ఆర్. డి. ఓ. వగైరాలు కూర్చున్న జీపు వచ్చింది.

"బుల్‌డోజరు డ్రైవరు లక్ష్మణరావుకు నిన్నట్నుంచీ జ్వరం. వర్క్ సరిగా జరగలేదు సార్! సంజాయిషీ యిచ్చుకుంటున్నాడు కామేశ్వరరావు. కలెక్టరు మురళి టెంట్‌లోకి వచ్చి కూర్చున్నాడు." ఎన్ని దుప్పులో! అడవిలో హాయిగా బ్రతుకుతున్న వాటన్నిటినీ, మనుషులకు ఆహారంగా, పరవతోలుతున్నానా?" అన్నాడు లక్ష్మణరావు మగతతో.

"ఏమంటున్నాడూ?" అన్నాడు కలెక్టరు మురళి ఆశ్చర్యంగా.

"వెధవ్వాగుడు! పిచ్చివాగుడు. అసలితగాణ్ణి సెలెక్ట్ చెయ్యటం నాదే పొరపాటనిపిస్తోంది. మొక్కలంటాడు. మానులంటాడు. జింక లంటాడు. పక్షులంటాడు. వృక్షసంపదా, ప్రకృతి మాతా అంటాడు. ఏమేమిటో పైత్యపు వాగుడు! సెంటిమెంటల్ ఫూల్!" అన్నాడు కామేశ్వరరావు కంపరంగా లక్ష్మణరావు కేసి చూస్తూ. కలెక్టర్ మురళి స్టాఫ్‌తో, వర్కు జరిగిన స్పాట్‌కు వెళ్ళి చూశాడు. త్రోవ పొడుగుతా కృష్ణమూర్తి, కామేశ్వరరావు లక్ష్మణరావులు వల్ల వర్క్ ఎలా ఆగిపోయిందీ వర్ణించి వర్ణించి చెప్పారు. అతగాణ్ణి ఉద్యోగంలోంచి తీసివేస్తానని కూడా చెప్పాడు కామేశ్వరరావు.

"సరే! ఆ కుర్రాణ్ణి....నా జీపులో పడుకోబెట్టించండి. హాస్పటల్లో చేర్పిద్దాం. ఇక్కడే వుంటే ప్రమాదం." అన్నాడు మురళి.

"పీడా వదలిపోయింది!" అనుకున్నాడు కామేశ్వరరావు. కలెక్టరు తనను తిట్టనందుకు లోలోపల ఆనందపడిపోయాడు.

జీపు కదిలింది. లక్ష్మణరావు వుండీవుండీ కలవరిస్తూనే వున్నాడు మగతలో. "సార్! ఎంత పెద్ద భారీ చెట్లో చూడండి! ఈ అడవిలో చారపప్పు బాగా దొరుకుతుంది సార్, పరిగెత్తే కుందేళ్లూ, జింకలూ, పాములూ - ప్రకృతి సృష్టించిన అందమైన సజీవ శిల్పాలు కావా! ఈ

విధ్వంసకాండ నావల్లకాదు సార్ ! మనిషి అడుగెట్టిన ప్రతిచోటా ప్రకృతి ధ్వంసం అయిపోవలసిందేనా ?" ఏమేమిటో అంటున్నాడు.

"కాకపోతే ! ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, తోటమాలిపని చేసు కొందువుగానీలే తమ్ముడూ ! లేదా అడవులను పెంచుదువుగానీ !" వెట కారంగా అన్నాడు కృష్ణమూర్తి, కలెక్టరు తనకేసి మెప్పుగా చూడాలని.

"ఇతగాడు ఉద్యోగానికి రాకముందు తోటమాలా ?" అన్నాడు మురళి ఆసక్తిగా.

"ఊహూఁ ! ఇతగాడి తండ్రి తోటమాలి, ఇతగాడూ, వెంటా వెనకా తిరుగుతూ...." కథచెప్పినట్లు చెప్పాడు గొప్పగా కృష్ణమూర్తి.

"ఐ. సీ !" అన్నాడు మురళి.

లక్ష్మణరావును హాస్పిటల్‌లో చేర్చాడు. పదిరోజులకుగానీ అత గాడు మామూలుస్థితిలోకి రాలేదు. ఆరోజు ఉదయం....కలెక్టరు మురళి స్వయంగా తనను చూడటానికి వస్తున్నాడని తెలిసి కంగారుపడ్డాడు లక్ష్మణరావు. ఉద్యోగం పోతుందని భయపడ్డాడు. ఇక చేసేందుకేమీ లేదని, పరిస్థితి తన చెయ్యిదాటిపోయిందనీ గాభరాపడి, ముందుగానే రాజీ నామా రాసిపెట్టాడు.

"హల్లో ! లక్ష్మణరావ్ ! ఎలా వున్నావు ?" అంటూ వచ్చాడు కలెక్టరు మురళి.

"బావున్నాను సార్ !" అన్నాడు లక్ష్మణరావు బెడ్‌మీద లేచి కూర్చుంటూ.

"నిన్ను జాబ్‌లోంచి తీసేస్తూ ఆర్డర్సు వచ్చాయి !" అన్నాడు మురళి.

క్షణకాలం పలకలేదు లక్ష్మణరావు. కామేశ్వరరావు పట్టుదల తనకు తెలుసు. అనుకున్నదే అయినా, వినటం బాధాకరంగా వుంది.

"కానీ మరో అడవికి....ఆ అడవి, కొండల మధ్య, షుమారు రెండువేల ఎకరాల విస్తీర్ణంలో వుంది....అక్కడికి పోస్టు చేస్తున్నాను నిన్ను!" అన్నాడు మురళి.

లక్ష్మణరావు కంగారుగా అరిచాడు. "ఒద్దు సార్! ఈ అడవులు నరికే పని నాకొద్దు. నేను నా జాబ్‌కు సంతోషంగా రాజీనామా రాసికూడా వుంచాను. ఇదుగోండి రాజీనామా కాగితం!" మురళి నవ్వాడు. "అడవులు నరికే పని కాదోయ్! వన్యమృగాలను సంరక్షించే పథకం ఒకటుంది. ఆ అడవిలో నీక్కావలసిన వన్యమృగాలన్నీ వున్నాయి. కొందరు ఫారెస్టు ఆఫీసర్లు, అడవుల రక్షణ బదులుగా, భక్షణ చేస్తుంటారు! తెలుసుగా! అలా చేయకుండా, వన్యమృగాలనూ, వన్యసంపదనూ, సంరక్షించే వుద్యోగిగా, ప్రమోషన్‌తో పోస్టు చేశాం! ఆ పోస్టుకు స్పెషల్‌గా నిన్ను రికమెండ్ చేశాను నేను!" అంటూ ఆర్డర్ కాగితం చేతికిచ్చాడు మురళి.

కలో నిజమో తెలీలేదు లక్ష్మణరావుకు.

మూడోరోజే, ఆర్డర్సు చేతబట్టుక, ఆ కొండలమధ్య, అడవిలోకి.... సంతోషంగా వెళ్ళాడు లక్ష్మణరావు.

ఈ సంగతి తెల్సి నిర్ఘాంతపోయిన కామేశ్వరరావుతో, మెల్లిగా అన్నాడు మురళి.

"ఉద్యోగాల బురఖాలు తీసేసి, మనుషులుగా ఆలోచిస్తే ఎదుటి మనిషిలోని నిజమైన అభిరుచి ఏదో, అతగాని ఆర్తి ఏమిటో అర్థమవుతుం దండీ! లక్ష్మణరావులో చెట్ల పట్ల, అడవులపట్ల, అద్భుతమైన ఆరాధన వుంది. అతగాడి మనసులో చిన్నతనంలోనే, తోటే దేవాలయంగా,

మొక్కలే దేవుళ్ళగా రూపుదాల్చాయి. అతగాడికి సరైన వుద్యోగం ఇప్పటిదే గానీ, అడవులు నరికేదిమాత్రం కాదు. ఓ విధమైన కళాతపస్వి అతగాడు. ప్రకృతిమాత ఆరాధకుడు! అసలు మనలో ఓ పెద్దలోపం వుంది. బహుశా కొన్నితరాల తర్వాతగానీ ఈ లోపం సరిగాదేమో! మనిషి అభిరుచికి సరిపోయిన చదువూ, ఉద్యోగమూ, అతగాడికి కల్పిస్తే, మన దేశంలో నిర్భాద్యతా, అసంతృప్తీ, దారిద్ర్యమూ, వుండవనుకుంటాను!"

కలెక్టరు మురళి మాటలు ఎంతవరకూ అర్థమయ్యాయోగానీ, కామేశ్వరరావు మాత్రం లోలోపల చిరాకుపడ్డాడు.

"కుర్ర కలెక్టరుక్కూడా కాస్త పైత్యంవుంది. ఏంచేస్తాం? ఉద్యోగరీత్యా అతగాడి మాటలకు....ఔననాలి!

("ఆకాశవాణి" సౌజన్యంతో)

12 అక్టోబరు, 1975